మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.mananationalistvoice.com epaper.mananationalistvoice.com
ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 189 | 06 శనివారం, జూన్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-
హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ట, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం



రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు


# జార్ఖండ్‌లో కాంగ్రెస్‌కు జేఎంఎం ఝలక్

## - రెండు రాజ్యసభ సీట్లకు అభ్యర్థుల ప్రకటన



**రాంచీ,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

జార్ఖండ్‌లోని 'ఇండియా' కూట మిలో తాజాగా విభేదాలు పొడ చూపే అవకాశాలు కనిపిస్తు న్నాయి. జార్ఖండ్ నుంచి రెండు రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, రాష్ట్రంలో జేఎంఎం భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఒక సీటును ఆశిస్తోంది.

# నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

## - బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
## - బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
## - పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**మహబూబాబాద్,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు.

వివరాలు 2లో

# కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

## - శోకం మిగిల్చిన ఎల్లమ్మ పండగ వేడుక
## - మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత

**కామారెడ్డి,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు.



# పర్యావరణంతో సంబంధం లేని అనేం

- పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి
- కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం

2 లో

# పుప్పాలగూడలో ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

## - అన్యాక్రాంతం కాకుండా కాపాడిన హైడ్రా

**హైదరాబాద్,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. రూ.30వేల కోట్ల విలువైన భూమిని కాపాడినట్లు హైడ్రా తెలిపింది.పుప్పాలగూడ భూముల్లో చారిత్రక రాతి గుట్టలు ఉన్నాయి. ఈ భూములను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతిని ధులు దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

# అసమ్మతికి కళ్లెం వేసే యత్నం

## - లోక్‌సభకు పోచేసే యోచనలో మమత



వివరాలు 2లో


**కోల్‌కతా,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

తృణమూల్ కాంగ్రెస్‌కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరిమితమైంది.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

## - సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**




కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించు కోలేదని విమర్శించారు.దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు.

వివరాలు 2లో

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

## - ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా- సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్



**హైదరాబాద్,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజా మాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

వివరాలు 2లో



# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

- కీమిషన్ల దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే - కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కమిషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా..కూలింది- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే- పాలమూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కెసిఆర్ చేసింది శూన్యం
- గతంలో ఇబ్బడిముబ్బడి అప్పలతో మళ్లీ అప్ప పుట్టకండా చేశారు- జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం- రెండోరోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి

2 లో

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## - విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు
## - ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
## - ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు

2 లో



# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

మొదటిపేజీ తరువాయి

మహబూబ్‌నగర్,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళు తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మొదటిపేజీ తరువాయి

విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు.నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జ్‌ని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷-లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)

ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎ÷-లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపా÷-టం÷-మెంట్ అధికారులు పాల్గొన్నారు.



# నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# అసమ్మతికి కళ్లెం వేసే యత్నం

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపుర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారురు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపుర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు. మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పుర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్ అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. రైల్వేమంత్రిగానూ పనిచేశారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తెది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు సన్నిహితురాలిగా పేరున్న పార్టీ సీనియర్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ బహిరంగంగానే ఇటీవల తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బరాసత్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఉన్న ఆమె లోక్‌సభలో తనపై అనుచితంగా మాట్లాడుతున్నారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ పనితీరును ప్రశ్నించిన సీనియర్ ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్, శాంతను సేన్ సైతం ఉన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తిరుగుబాటును టీఎంసీ ఎదుర్కొంటోంది. టీఎంసీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీకి చెందిన 57 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. స్పీకర్ రతీంద్ర బోస్ కూడా ఈ నియామకాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా లోక్‌సభలో అసమ్మతికి కళ్లెం వేసేందుకు సభలో అడుగుపెట్టాలనే ఆలోచనలో మమతా బెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

మొదటిపేజీ తరువాయి

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యవారణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యవారణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకం

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(నేషనలిస్ట్ వాయిస్):

నిందితులకు శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు డ్యూటీ అధికారులకు కేసుల పట్ల పూర్తి అవగాహన స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కల్పించాలని సూచనలు చేశారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్రంగా కేసులను పర్యవేక్షించాలని ఆదేశాలను జారీ చేశారు. సమ్మన్స్ వారెంట్ల జారీలో జాప్యం లేకుండా సకాలంలో సాక్షులకు నిందితులకు అందజేయాలని సూచించారు. కోర్టులో విచారణ నడిచే సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసుకోవాలని సాక్షులకు కేసు వివరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీని ఎప్పటికప్పుడు కోర్టులో హాజరు పరచాలని తెలిపారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్ష పడే విధంగా కేసుల పరిష్కారంలో కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సబ్ ఇన్స్పెక్టర్లు కోర్టు లైజరింగ్ ఆఫీసర్ కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.





# సింగరేణిలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత

## సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ







భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(నేషనలిస్ట్ వాయిస్):

సింగరేణి సంస్థ దేశ ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత నిస్తోందని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూర్య నారాయణ మాట్లాడుతూ సింగరేణిలో విస్తృత స్థాయిలో హరితీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల గాలి నీరు భూ వనరులపై ప్రభావాలను పర్యవేక్షించి ఆధునాతన సాంకేతికతల ద్వారా వివిధ కాలుష్య నియంత్రణ చర్యలను అమలుపరచడం జరుగుతోందని తెలిపారు. గనుల మూసివేత సమయంలో గని ప్రరిసర ప్రాంతాలలో ఓబి డంపులపై మొక్కలను నాటుతున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 16,790 హెక్టార్ల ప్రాంతంలో 6.68 కోట్ల మొక్కలు నాటడం అలాగే సమీప గ్రామస్తులకు 2.32 కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. నీటి సంరక్షణ ప్రయత్నాలలో భాగంగా నీటిపారుదల గృహ వినియోగం కోసం గని నుండి బయటకు తీసిన నీటిని శుద్ధి చేసి అందించడం జరుగుతోందని అన్నారు. పర్యావరణ బాధ్యతతో చుట్టుపక్కల గ్రామాలలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు 25కి పైగా చేయడం జరిగిందన్నారు. సాగు నీటి చెరువులలో పూడికతీత చెక్ డ్యామ్ ల నిర్మాణం అర్బన్ పార్క్యుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటుగా భూగర్భ జలాలను మెరుగుపరచడానికి గనుల ఆవరణలో సుమారుగా 62 నీటి ట్యాంకులు తవ్వడం జరిగిందని తెలిపారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ ఉనికిని కాపాడటానికి ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను పెంచి పర్యావరణం కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డైరక్టర్(ఈ అండ్ఎం) ఎం.తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఇప్పటివరకు 245.50 ఎండబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కొరకు సింగిల్ యుజ్డ్ ప్లాస్టిక్ ల వాడకాన్ని నివారించటానికి జ్యూట్ బ్యాగులను అందించారు. వన మహోత్సవం కార్యక్రమాలలో భాగంగా ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కొత్తగూడెం బంగ్లాస్ లో ఏర్పాటు చేసిన మొక్కలను నాటే కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు. జిఎం(ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్) బి.సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిఎం(సిపిపి) ఏ. మనోహర్, అడ్వైసరీ(ఫారెస్ట్)ఎం.సి. ఎం.సి. పార్జిన్, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి )సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, కార్పొరేట్ కార్పొరేట్ సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవ రావు, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు ఉద్యోగులు, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# పర్యావరణ ప్రజలందరి బాధ్యత పచ్చదనంతోనే గ్రామాల అభివృద్ధి

## సర్పంచ్ దేశ్ముఖ్ చంద్ర భూపాల్ రావు

( కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : జూన్ : 5)

పర్యావరణ ప్రజలందరి బాధ్యత పచ్చదనంతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని ముజాహిద్పూర్ సర్పంచ్ దేశ్ముఖ్ చంద్ర భోపాల్ రావు అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్పూర్ గ్రామములో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సర్పంచ్ దేశ్ముఖ్ చంద్ర భూపాల్ రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుల్కచర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ , మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్. ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై పర్యవేక్షించారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామ ప్రజ లందరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించాలని తెలిపారు. భూ భౌగోళిక విస్తీర్ణంలో కనీసం 33 శాతం మొక్కలను పెంచుతూ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అనంతరం సర్పంచ్ గ్రామ సర్పంచ్ దేశ్ముఖ్ చంద్ర భూపాల్ రావు మాట్లాడుతూ, ప్రజలందరూ సహకరిస్తే ముజాహిద్ పూర్ గ్రామాన్ని కళకళలాడే పచ్చదనంతో తీర్చిదిద్దుతానని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్.ఆంజనేయులు, గ్రామస్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# విద్యా, వైద్య రంగాలలో దోపిడీని అరికట్టాలి:

## యండి అంజద్

మిర్యాలగూడ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 5.



విద్యా, వైద్య రంగాలలో జరుగుతున్న దోపిడీని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని సామాజిక కార్యకర్త యండి అంజద్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థలు అధిక ఫీజులు, డొనేషన్ల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దోపిడీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, ఫీజులను నియంత్రించే చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొంటూ, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ, ఆచరణలో మాత్రం తగిన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కొన్ని కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థలు తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. విద్యా, వైద్య రంగాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాలను రూపొందించి, వాటిని కఠినంగా అమలు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో విద్యా, వైద్య సేవల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు విద్యా, వైద్య రంగాల్లో సంస్కరణలు చేపట్టి, కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని యండి అంజద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మొక్కల పెంపకంతోనే స్వచ్ఛమైన ఆక్సిజన్

-పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత-జిల్లా కలెక్టర్ అంకిత్

-సింగరేణి కొత్తగూడెం ఏరియాలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(నేషనలిస్ట్ వాయిస్):

మొక్కల పెంపకంతోనే స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కర బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వి.కే.సి.ఏం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్ తదితరులు కలెక్టర్తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది ప్రజా ప్రతినిధులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# పరిగి నూతన కమీషనర్ కె. మల్లేష్ ను సన్మానించిన డిస్కం

## ఏఈ హరికృష్ణ, 11వ వార్డు కౌన్సిలర్ ఏజాస్

పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 05

పరిగి మున్సిపల్ నూతన కమిషనర్ కె. మల్లేష్ ని పరిగి డిస్కం ఏఈ హరికృష్ణ, 11వ వార్డు కౌన్సిలర్ ఎండీ. ఏజాస్ లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు యువకులు అనిల్, నాగరాజ్, సల్మాన్, అహ్మద్ ,అస్లశీ తదితరులు పాల్గొన్నారు.



# ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్ముతున్న దుకాణదారుల పైన చర్యలు తీసుకోవాలని ఏవో కు వినతి పత్రం అందజేసిన రైతు సంఘం నాయకులు

పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 05

ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాకుండా రైతుల నుంచి అధిక అమ్ముతున్న వ్యాపారుల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం అగ్రికల్చర్ ఏవో రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అధిక ధరలకు అమ్ముతున్న ఫర్టిలైజర్ల షాపుల పైన చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మద్దులపల్లి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఫర్టిలైజర్ షాప్ లో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరకు విక్రయాలు చేసి షాపు పేరు మీద రసీదు ఇవ్వాలన్నారు. రైతులకు తగిన న్యాయం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు నర్సింలు, బుచ్చయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# తూప్రాన్ లో కోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్





**-పాత ఎంపీడీవో కార్యాలయ భవనం కోర్టుకు అప్పగింత**

**-జులై 31లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు జిల్లా న్యాయమూర్తి ఆదేశం**

**-ఆగస్టులో కోర్టు ప్రారంభానికి సన్నాహాలు**

**-మౌలిక వసతుల కల్పనకు రూ.30 లక్షలు మంజూరు**

**-ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన జిల్లా న్యాయమూర్తి**

**తూప్రాన్, జూన్ 5. నేషనలిస్ట్ వాయిస్:**

తూప్రాన్ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కోర్టు ఏర్పాటు కల సాకారం కానుంది. తూప్రాన్ పట్టణంలో కోర్టు స్థాపనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపాదిత కోర్టు భవనంగా గుర్తించిన పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించి కోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని కోర్టు అవసరాల కోసం అధికారికంగా అప్పగించారు. భవనాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి, కోర్టు కార్యకలాపాలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జులై 31వ తేదీలోపు అన్ని మరమ్మతులు, అభివృద్ధి పనులు పూర్తి చేసి భవనాన్ని సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**రూ.30 లక్షలతో ఆధునిక సౌకర్యాలు**

తూప్రాన్ కోర్టు ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, భవన మరమ్మతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల గదులు, న్యాయవాదుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, రికార్డు గదులు, ప్రజల కోసం నిరీక్షణ మందిరాలు తదితర సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇప్పటికే రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి కోర్టు నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దనున్నారు. ఆగస్టులో కోర్టు ప్రారంభం పనులు నిర్ణీత గడువులోగా పూర్తైతే ఆగస్టు నెలలోనే తూప్రాన్ కోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు న్యాయశాఖ వర్గాలు తెలిపాయి. కోర్టు ప్రారంభం కావడం ద్వారా తూప్రాన్‌తో పాటు పరిసర మండలాల ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కానున్నాయి. ప్రస్తుతం చిన్న, మధ్యస్థాయి న్యాయ వ్యవహారాల కోసం మెదక్, సంగారెడ్డి, గజ్వేల్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న ప్రజలకు ఇక స్థానికంగానే న్యాయం అందుబాటులోకి రానుంది.

**ప్రజల చిరకాల కోరిక నెరవేరుతున్న వేళ**

తూప్రాన్ పట్టణం వాణిజ్య, విద్యా, పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చెందినప్పటికీ కోర్టు లేకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కోర్టు ఏర్పాటుకు స్థానిక న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వచ్చారు. తాజాగా జిల్లా న్యాయమూర్తి స్వయంగా భవనాన్ని పరిశీలించడం, నిధుల మంజూరు, పనుల గడువు నిర్ణయించడం వంటి పరిణామాలతో కోర్టు ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్‌లు ప్రతిపాదిత కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ హరితహారం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. తూప్రాన్‌లో కోర్టు ఏర్పాటు ప్రక్రియకు జిల్లా న్యాయమూర్తి పర్యటన కీలక మలుపుగా మారగా, ఆగస్టు నాటికి కోర్టు అందుబాటులోకి వస్తుందన్న ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, న్యాయవాదులు బొడ్డు శ్రీనివాస్, ఎం. అశోక్, వేణుగోపాల్ చారి, శివకుమార్, శ్రీపతిరావు, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటిన కమిషనర్

**తూప్రాన్, జూన్ 5. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి ప్రభావతి తో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఒక మొక్క నాటడం, నీటిని పొదుపుగా విని యోగించడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యల ద్వారానే భావి తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన భూమిని అందించగలమని విద్యార్థులకు సూచిం చారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసు కోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నిర్వ హించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించిందని నిర్వా హకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి ప్రభావతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ మేనేజర్, సీనియర్ అకౌంటెంట్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.






# గోమాతని రాష్ట్ర జంతువుగా ప్రకటిస్తే ఏ గొడవ ఉండదుగా అని తెలియదా అక్కడ ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి

**హైదరాబాద్( నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)జూన్ 05**



గోమాతని రక్షించాలని ప్రతి ఒక్క ఒక పౌరుడు ఆలోచిస్తే అది ఒక పెద్ద సమస్యనే కాదు ఏ గొడవలు ఉండవు వాళ్ళు తింటున్నారు వీళ్ళు అమ్ముతున్నారని ఏ గొడవ ఉండదు గోమాత అంటే మాత లాగా చూసుకోవాలి కానీ సంతలో సర్కులాగా అమ్మకూడదు ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం 12 ఏళ్లుగా పరిపాలిస్తున్నది ఢిల్లీలో ఇప్పుడు అనుకుంటే ఇట్టే ఈ బిల్లు పాస్ చేసి గోమాతని రాష్ట్ర జంతువుగా ప్రకటించి అందరికీ మేలు చేయాలి మనలో ఉన్న వైశ్యామ్యాలన్నీ తొలగిపోతాయి కానీ కొందరు ఏం చేస్తున్నారంటే గోరక్షకులను బలి చేసి హిందూ ముస్లిం అని అనుకుంటా వివిధ మతాల మధ్యలో విద్వేషాలు పుట్టించి గొడవలు చేస్తూ దాన్ని రాజకీయంగా వాడుకొని ఓట్లు దండుకుంటున్నారు ఇది పోవాలంటే అన్ని తొలగిపోవాలంటే ఇది కచ్చితంగా గోమాతని రాష్ట్రం మాతగా ప్రకటించాలి ఇది రాష్ట్రంలో ఢిల్లీలో ఏలుతున్న ప్రభుత్వందే మొదటి బాధ్యత వాళ్లే గోరక్షకులు చేయమంటారు మళ్లీ వాళ్లే అమ్ముతారు మరి ఇప్పుడు ఉన్న భారత పౌరులు ఎటువైపు పోవాలి ఒక పెద్ద కన్ఫ్యూజన్లో ఉన్నారు అందుకని ఈ యొక్క విషయం తొలగిపోవడానికి గోమాతని రాష్ట్రమాతగా జంతువుగా ప్రకటించాలి కచ్చితంగా జై గోమాత జైహింద్ ఇట్లు మీ రమేష్ బహుజన జై తెలంగాణ జైహింద్

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్

**( కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : జూన్ : 5)**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కుసుమ సముద్రం సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని కుసుమ సముద్రం గ్రామపంచాయతీ నందు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ ప్రజలతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాల సమగ్ర అభివృద్ధికి, పర్యావరణ సమతుల్యతకై గ్రామ ప్రజలందరూ మొక్కలు నాటి వాటి సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతన పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పద్మ కృష్ణయ్య, వార్డు సభ్యులు కవిత, సురేష్, శ్రీనివాస్, మల్లమ్మ, బీఆర్ఎస్ నాయకులు దొంగల చెన్నయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భీమయ్య, మహిళా సంఘాల సభ్యులు అనురాధ, కల్పన మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



# తూప్రాన్‌లో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణ

**తూప్రాన్, జూన్ 5. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల వినియోగం కోసం ఏర్పాటు చేసిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పబ్లిక్ టాయిలెట్లను మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. టాయిలెట్ల నిర్వహణ, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై ఆరా తీసి, మరమ్మతులు చేయాల్సిన అవసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న రెండు ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లలో అవుట్‌ఫ్లో వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆయన సూచించారు. ప్రజలకు పబ్లిక్ టాయిలెట్లు అన్ని సౌకర్యాలతో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ కె. రమేష్ కుమార్ తెలిపారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టాయిలెట్ల నిర్వహణను మెరుగుపరుస్తామని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సౌకర్యాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.



# సంజీవన్‌రావుపేట గ్రామం సందర్శించిన సబ్ కలెక్టర్

**నారాయణఖేడ్ (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి) జూన్ 05**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల్ సంజీవన్‌రావుపేట గ్రామాన్ని సబ్ కలెక్టర్ ఈరోజు సందర్శించి గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత - జడ్జి దుర్గం గణేశ్

**సుల్తానాబాద్ మే-05 నేషనలిస్ట్ వాయిస్**

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో,న్యాయవాదులతో కలిసి జడ్జి గణేశ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి కి లభించిన విలువైన సంపద పర్యావరణం అని, దానిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని, సహజ వనరుల సంపదను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆవుల శివకృష్ణ, ఎజిపి దూడం ఆంజనేయులు, న్యాయవాదులు మాదూరి ఆంజనేయులు, పడాల శ్రీరాములు, జోగుల రమేష్, పెగడ శ్యామ్ సుందర్, సామల రాజేంద్ర ప్రసాద్, గుడ్ల వెంకటేష్, మల్యాల కరుణాకర్, ఆకారపు రామకృష్ణ రెడ్డి, మాదూరి పృథ్వీ, గండి శ్రీనివాస్ , కోర్టు సిబ్బంది పాల్గొన్నారు..

# సింగరేణి స్కూల్ రిక్రూట్మెంట్ లో అవకతవకలు

## విద్యార్థి సంఘం నేత కోట శివశంకర్ ఆరోపణ

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(నేషనలిస్ట్ వాయిస్):**



సింగరేణి స్కూల్ రిక్రూట్మెంట్ లో అవకతవకలు జరిగాయని పేరుకే పబ్లిక్ నోటిఫికేషన్ వెయ్యడం జరిగిందని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ రాష్ట్ర విద్యార్థి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. రిక్రూట్మెంట్ వారి ఇష్టానుసారంగా నిర్వహించారని మండిపడ్డారు. ఆ మాత్రం దానికి నోటిఫికేషన్ ఎందుకు ఇచ్చారని పాతావారినే ప్రకటించుకోవచ్చు కదా అని విమర్శించారు. నోటిఫికేషన్ మార్కుల ఆధారంగా కొంత ఎక్స్పీరియన్స్ ద్వారా ఎంపిక జరుగుతుందని కానీ సింగరేణి అధికారులు నోటీసు బోర్డు ద్వారా ఇంటర్వ్యూలు చేపట్టారని ఆరోపించారు. కొత్తగూడెం సింగరేణి స్కూల్లో రిక్రూమెంట్ను రద్దుచేసి మరల ఇంటర్వ్యూలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం మణుగూరు సింగరేణి స్కూల్లో ప్రతి సంవత్సరం కొత్త వారిని నియమించాలని దృక్పథంతో సింగరేణి యాజమాన్యం స్కూలుకు సంబంధించిన టీచర్లు, పిఈటీ, అటెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. మొత్తం సింగరేణి స్కూల్ రిక్రూట్మెంట్ కొత్తగూడెం మణుగూరులో అవకతవకలు జరిగాయని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలనీ కోట శివశంకర్ డిమాండ్ చేశారు.

# గజ్వేల్ కాంగ్రెస్‌లో “ఏకపక్ష నియామకాలు వద్దు..

## పాత కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యం ఇవ్వాలి”

### పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎదుట గజ్వేల్ నేతలు

**హైదరాబాద్, గాంధీభవన్ జూన్ 5:**

గజ్వేల్ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత అసంతృప్తి మరోసారి బహిర్గతమైంది. గతంలో జరిగిన మార్కెట్ కమిటీలు, పార్టీ పదవుల నియామకాలపై తీవ్ర అసంతృప్తితో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు నేరుగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ను కలిసి తమ గోడును వినిపించారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్యకర్తలను పక్కనపెట్టి, కొందరి సూచనల మేరకే మార్కెట్ కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవులు కట్టబెట్టారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారిని విస్మరించి, ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీలోకి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం వల్ల నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొందని వారు పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన మహేష్ కుమార్ గౌడ్, ఇకపై ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రీతంకు ప్రత్యేకంగా సూచనలు చేస్తూ, రానున్న పీఏసీఎస్ చైర్మన్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాల విషయంలో స్థానిక కార్యకర్తలు, సీనియర్ నాయకులు, పార్టీకి అంకితభావంతో పనిచేసిన పాత కాంగ్రెస్ కుటుంబాలను సంప్రదించాల్సిందేనని ఆదేశించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గజ్వేల్ కాంగ్రెస్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న “వర్గ పోరు” మరియు “ఏకపక్ష నిర్ణయాల”పై నాయకులు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన కేడర్‌ను విస్మరిస్తున్నారనే విమర్శలు క్షేత్రస్థాయిలో పెరుగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం గమనార్హం. దీనిపై స్పందించిన ప్రీతం, త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గ స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, అన్ని మండలాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తామని తెలిపారు. ఇకపై పదవుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గజ్వేల్ కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తిని అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పటికే జరిగిన నియామకాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు, భవిష్యత్తులోనైనా పార్టీ కోసం కష్టపడిన వారికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు.



# పరిశ్రమల అభివృద్ధికి అధికారులు మార్గదర్శకులుగా వ్యవహరించాలి- జిల్లా కలెక్టర్





**భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(నేషనలిస్ట్ వాయిస్):**

పరిశ్రమల అభివృద్ధికి అధికారులు మార్గదర్శకులుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి పెట్టుబడుల ప్రోత్సాహం ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లా డుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అధికారులు మార్గ దర్శ కులుగా వ్యవహా రించాలని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన సలహాలు సహాయ సహకారాలు అందించి కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్పించాలని అన్నారు. పరిశ్రమల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్క రించడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీలు ప్రోత్సాహక పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి కోసం వైటీసీ పాలిటెక్నిక్ ఇతర సాంకేతిక విద్యా కోర్సులపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో నూతన కోర్సుల వివరాలతో కూడిన కరపత్రాలను అందుబాటులో ఉంచి విద్యార్థులను ప్రోత్స హించాలన్నారు. సమావేశంలో భాగంగా టీజీఐ పాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. మొత్తం 50 దరఖాస్తులు అందగా వాటిలో 39 పరిశ్రమలకు అను మతులు మంజూరు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఒక దరఖాస్తు తిరస్కరించగా మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్క రించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ పారిశ్రా మికవేత్తల సేవా రంగ సంస్థలకు పెట్టుబడి రాయితీ పథకం అమలు దరఖాస్తుల స్థితిగతులపై కూడా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్లస్టర్ అభివృద్ధి స్థానిక వనరుల ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల పురోగతిపై కూడా సమీక్ష నిర్వ హించారు. యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించేలా ఉద్యోగ మేళాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.పరిశ్రమల సంఖ్యను పెంచి జిల్లాను పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. సమావేశంలో డేవిడ్ రాజు ఏపీఓ జనరల్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎల్ డి ఎం రామిరెడ్డి, మెప్మా పీడీ రాజేష్, జిల్లా క్రీడా శాఖ అధికారి

# ముగిసిన కల్లేపల్లి బంగారు మైసమ్మ వారి బహిరంగ వేలం పాట..

## కల్లేపల్లి బహిరంగ వేలముల ఆదాయము రూ. 59,22,000/-





**దామరచర్ల నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 5.**

ప్రముఖ గిరిజనుల ఆరాధ్య దైవం కోరిముక్కితే కోరికలు తీరుస్తున్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి అని ఆలయ చైర్మన్ దస్రు నాయక్ ఆలయ అధికారి గుజ్జుల కొండారెడ్డి అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి దేవస్థానంలో తేదీ 01-07-2026 నుండి 30-06-2027 వరకు ఒక సంవత్సర కాలపరిమితికి వివిధ రకముల హక్కులకు సూర్యాపేట విశ్వనాథ స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ దస్రు నాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలములు నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో మొత్తం ఆదాయం రూ.59,22,000/- లు ఆదాయము వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాణ అధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొని వివిధ హక్కులు దక్కించుకున్న వారు నెహ్రూ నాయక్ కల్లేపల్లి దున్నపోతులు సమకూర్చుకొను హక్కు 20,35,000/- లు, వినోద్ కుమార్ కల్లేపల్లి టెంకాయలు అమ్ముకొను హక్కు రూ. 20,03,000/- , లు, తాటి పద్మ మిర్యాలగూడ, లడ్డు ప్రసాదం అమ్ముకొను హక్కు రూ. 9,26,000/-లు, బాల కల్లేపల్లి తలనీలాలు సేకరించుకొను హక్కు దక్కించుకొనుగా 2,51,000/- లు, ఉదయ్ శెట్టి జానపాడు కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కు రూ. 5,05,000/-, ఉదయ్ శెట్టి జానపాడు పూలదండలు అమ్ముకొను హక్కు రూ. 2,02,000/- లు మొత్తం లో గత సంవత్సరం కంటే రూ. 10,46,000/-లు అధికంగా వచ్చినట్లు ఈఓ కొండారెడ్డి తెలిపారు. ఇట్టి బహిరంగ వేలంలో కల్లేపల్లి గ్రామ సర్పంచ్ రజిత మల్లు నాయక్, మాజీ సర్పంచులు జనార్ధన్ నాయక్, లింగా నాయక్, మాజీ ఎంపీటీసీ నెహ్రూ నాయక్, మాజీ దేవాలయ చైర్మన్లు పాచ్చు నాయక్, భాష్యానాయక్, దశ్రు నాయక్, ఎర్ర నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, రామ్మోహన్ నాయక్, లింగా నాయక్, అమ్మవారి ఆలయ వంశస్థులు, ఆలయ పూజారులు అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో బందోబస్తు నిర్వహించారు.

# పర్యావరణ స్పృహతో పుడమిని రక్షిద్దాం

## సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపు

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్5(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్పృహతో భూమి తల్లి రక్షణకు పూనుకోవాలని ప్లాస్టిక్ వినియోగం తగ్గించి మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణకు దోహదపడాలని సింగరేణి సంస్థ చైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. సింగరేణి భవన్ లో శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించి సందేశం ఇస్తూ విధి నిర్వహణలోను తన వ్యక్తిగత జీవితంలో కూడా ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్ఫూర్తిని పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరూ పర్యావరణ ప్రతిజ్ఞ స్వీకరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్)గౌతమ్ పొట్రు, ఈడీ (కోల్ మూవ్ మెంట్)బి.వెంకన్న, జనరల్ మేనేజర్(కో ఆర్డినేషన్)మార్కెటింగ్ టి.శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో కూడా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు, పలుచోట్ల మొక్కలు నాటారు.




# పర్యావరణ ప్రతి పౌరుడి బాధ్యత

## పచ్చదనంతోనే సమగ్ర అభివృద్ధి

### వార్డు మెంబర్ మోత్కూరు వెంకటేష్

**( కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : జూన్ 5)**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత పచ్చదనంతోనే సమగ్ర గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కుల్కచర్ల వార్డు మెంబర్ మోత్కూరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రము లోని మైలమ్మ చెరువు హనుమాన్ దేవాలయం దగ్గర గ్రామ సర్పంచ్ వార్యాల అంజిలయ్య పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గౌడ్ గ్రామ ఉప సర్పంచ్ విజయ్ కుమార్ మరియు గ్రామ ప్రజలతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కాలుష్య కోరల నుంచి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి తట్టు సంచులను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కే ఆంజనేయులు, వార్డు సభ్యు రాలు గాదె లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ రాంజీ, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఇస్లాంలో పర్యావరణ పరిరక్షణ కూడా ఆరాధనే

## జమాతే ఇస్లామి హింద్ షేఖ్ అబ్దుల్ బాసిత్

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(నేషనలిస్ట్ వాయిస్):**

సృష్టికర్త అయిన దైవం ఈ సృష్టిని మానవ మనుగడకోసం సమతుల్యంగా సృష్టించాడని ఆ సమతుల్యతకు భంగం కలగకుండా అవసరమైన మేరకు వాడుకోవాలి అంటూ ఖురాన్ లో ఆదేశించాడని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీలోని “మస్జిద్ ఎ ఖుబా” జరిగిన ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1450 సంవత్సరాలకు పూర్వమే పర్యావరణ పరిరక్షణ ప్రతి వ్యక్తి బాధ్యత అని అతి అన్నింటినీ అనర్థమే అని ప్రవక్త ముహమ్మద్ హెచ్చరించారని తెలిపారు. ప్రవహించే నది ఒడ్డున ఉన్న నీళ్ళను వృదా చేయారాదని పరిశుభ్రత విశ్వాసంలో సగభాగం అని తెలిపారు. చుట్టూ పక్కల స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.భూమి పై ఒక మొక్క నాటితే అల్లాహ్ మీ కోసం స్వర్గంలో ఒక మొక్క నాటుతాడని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వం యొక్క బాధ్యత మాత్రమే కాదని సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతని రాబోయే తరాలకు మనం ఇచ్చే అత్యున్నత బహుమానం స్వచ్ఛమైన గాలి నీరు పరిశుభ్రమైన వాతావరణం అని అన్నారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని తూట్లు పెట్టరాదని ఇప్పటి కాలుష్యం వల్ల కలిగే అనర్ధాలు చూస్తున్నామని అన్నారు.కేవలం ఒకరోజు పరివరణ పరిరక్షణ దినంగా పాటించడం కాదు అని ప్రతి రోజూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ మౌలానా మజ్హార్, సోను బాయ్, మదార్ సాహెబ్, తాజుద్దీన్, రఫీ, షబ్బీర్, ఉమర్, ఖలీల్ అహ్మద్, షకుర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



# గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పనులు పూర్తి కాలేదు..







**దేవరకద్ర జూన్ 5 నేషనలిస్ట్ వాయిస్**

గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నేడు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడానికి కారణం వారేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వారు ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరియు జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి, మరియు స్థానిక ఎమ్మెల్యే దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, మరియు జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులతో కలిసి పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలో భాగమైన ప్యాకేజీ 14 & 15 (కరివేన రిజర్వాయర్) పనులు తనిఖీ చేసి, విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి , ఇరిగేషన్ శాఖ మంత్రి వర్యులుఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ..గత ప్రభుత్వం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతలను పట్టించుకోలేదని..జూరాల నుంచి శ్రీశైలం నీటిని తరలించడమే బ్లండర్ మిస్టేక్ అని అన్నారు, 27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదని అన్నారు, బిఆర్ఎస్ పాలనలో బీమా, నెట్టెంపాడు, కోయల్ సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ఎస్ ఎల్ బి సి , డిండి, సీతారామ ప్రాజెక్టులేవీ పూర్తి కాలేదని తెలిపారు. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం వారి ప్రభుత్వ హయాంలోనే కూలిపోయిందని అన్నారు, 1 లక్ష 84 వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు నిర్మించారని అన్నారు. దేశంలో మొత్తంలో 60 శాతం వడ్లను తెలంగాణలో కొనుగోలు చేశామని, యాసంగి పంట ధాన్యం కొనుగోళ్లపై త్వరలోనే ప్రెస్ నోట్ విడుదల చేస్తామని అన్నారు.రాష్ట్రంలో 71 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేశామని, వడ్ల కొనుగోళ్ల కోసం రూ.16 వందల కోట్లు అదనంగా ఖర్చు చేశామని అన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి, మాట్లాడుతూ...కేసీఆర్ పాలనలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని, కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో పాలమూరులో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయిందని అన్నారు, బిఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుకు కనీసం భూసేకరణను కూడా పూర్తి చేయలేదన్నారు.

వలసల జిల్లాగా పేరొందిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు.. కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను స్వయంగా తానే తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పాలమూరు జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న నదీ జలాల పంచాయతీ నేపథ్యంలో త్వరలోనే శుభవార్త చెబుతామని పేర్కొన్నారు, గోదావరి, కృష్ణా నదీ జలాల పంపకం విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య చర్చలు జరుగుతున్నాయని.. ఇవి త్వరలోనే ఒక కొలిక్కి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు, నీటి పంపకాల విషయంలో త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త అందుతుందని తెలియజేశారు.

# ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.800 కూలి ఇవ్వాలి రెండు సార్లు ఫోటో విధానం రద్దు చేయాలి..

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్..**

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని బోడపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ రాజన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక మార్పులు చేస్తోందని విమర్శించారు.

ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే సంవత్సరానికి కనీసం రూ.2.50 లక్షల కోట్ల బడ్జెట్ అవసరమని, అయితే కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.90 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీ పేరుతో ఉన్న 2005 ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ జీ-రామ్-జీ (+--ఝఎ--+) పేరుతో కొత్త విధానాలను తీసుకురావడం సరికాదని ప్రశ్నించారు.

ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 గంటలకే పనికి వెళ్లినప్పటికీ, ఫోటో నమోదు ప్రక్రియ కారణంగా 10 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యల వల్ల ఫోటోలు నమోదు కాకపోవడంతో కూలీలు ఎర్రటి ఎండలో ఇబ్బందులు పడుతూ పని చేయాల్సి వస్తోందని తెలిపారు.ఈ రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పని ప్రదేశాల్లో కనీస వసతులు లేకపోవడం ఆందోళనకరమని, నీడ సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు, తాగునీరు, వడదెబ్బ నివారణకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో లేవని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టం ప్రకారం ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాల కారణంగా గతంలో మండలంలో సుమారు 4600 మంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొనగా, ప్రస్తుతం ఆ సంఖ్య 3 వేల లోపుకు పడిపోయిందని తెలిపారు. గతంలో అందించే ప్రయాణ భత్యం, గడ్డపార-మొన ఖర్చులు, వాటర్ బిల్లులు వంటి సౌకర్యాలను రద్దు చేయడం వల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

ఉపాధి హామీ చట్టంలో తీసుకొచ్చిన జీ-రామ్-జీ (+--ఝఎ--+) విధానాన్ని వెంటనే రద్దు చేసి, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, కూలీలకు పే స్లిప్‌లు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజన్న, మాజీ ఎంపీటీసీ, ఉపాధి హామీ కూలీలు మరియు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**- ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**- రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

**- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**



**ముంబై,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**- సిర్పూర్ పేపర్ మిల్స్, స్పర్ష సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు......**

**సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి జూన్ 05 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం బురదగూడా గ్రామపంచాయతీ లోని సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ (సి.ఎస్.ఆర్) కార్యక్రమంలో భాగంగా, స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం కల్పించడమే ధ్యేయంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీలు, క్లీనప్ డ్రైవ్‌లు, పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులకు, యువతకు పర్యావరణంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచ్ చాటరే స్వాతి , ఫీల్డ్ అసిస్టెంట్ చాటరే పోశెట్టి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు మరియు స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ప్రతినిధులు బి. సుశీల, పి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.







# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**

**ముంబై,జూన్5 (నేషనలిస్ట్ వాయిస్)**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్ఆర్ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284



# అమ్మవారికి ఒడి బియ్యం నింపిన ఆర్యవైశ్య సంఘం నారీమణులు

**దేవరకద్ర జూన్ 5 నేషనలిస్ట్ వాయిస్**

అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా 33 దేవతలకు ఒడి బియ్యం నింపే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరకద్ర మండల ఆర్యవైశ్య సంఘం నారీమణులు మహాలక్ష్మి ఆగ్రోటే క్ రైస్ మిల్లులో వెలిసిన మహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం నింపారు. జేష్ట అధికమాసం ముగిసే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు మంజుల రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సంఘం నారీమణులు పాల్గొన్నారు.



# బాపట్ల డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ బీ.ఉమామహేశ్వర్

**బాపట్ల : జూన్ 5 ( నేషనలిస్ట్ వాయిస్ )**



బాపట్ల జిల్లా ఎస్పీ బీ.ఉమామహేశ్వర్ శుక్రవారం బాపట్ల సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వివిధ నేరాలు,శాంతిభద్రతల పరిస్థితులపై జిల్లా ఎస్పీ సమీక్షించారు.ముఖ్యంగా ప్రాంతాల వారిగా జరుగుతున్న నేరాల సరళిని,వాటిని పూర్తిగా కట్టడి చేయడానికి తీసుకుంటున్న ముందస్తు చర్యల గురించి ఆరా తీశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘీక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.నేరాల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని,రాత్రి సమయాల్లో గస్తీ మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.పెండింగ్ లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు.శిరోరక్ష – ప్రాణ రక్ష కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.హెల్మెట్ ధరించడం వలన కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు వివరించాలన్నారు.పోలీసులు చలానాలు విధిస్తారనే భయంతో కాకుండా,స్వతహాగా వారే బాధ్యతతో హెల్మెట్ ధరించే విధంగా ప్రజలలో మార్పు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సీ.హెచ్.చంద్రమౌళి,బాపట్ల పట్టణ సీఐ రాంబాబు,రూరల్ సీఐ ప్రభాకర్ ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




# జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## - మొక్కలు నాటిన డాక్టర్ మణికంఠేశ్వర్

**జీలుగుమిల్లి, జూన్ 5(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ మణికంఠేశ్వర్ స్వయంగా మొక్కలు నాటి నీరు పోశారు.ఈ సందర్భంగా డాక్టర్ మణికంఠేశ్వర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. నాటిన మొక్కల సంరక్షణ కోసం హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్ తన వంతు సహాయంగా ఇనుప మెష్‌లను (ట్రీ గార్డ్స్) అందజేశారని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు సరోజిని, ఆదిలక్ష్మి, ఫార్మసిస్ట్ నాగేశ్వరరావు, స్టాఫ్ నర్సులు జ్యోతి, మంగాయమ్మ, కెజియాతో పాటు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణాన్ని రక్షించడం మనందరి బాధ్యత: ఎంపీటీసీ నాలి శ్రీను

## - పి. అంకంపాలెంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**జీలుగుమిల్లి జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్):**



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పి. అంకంపాలెం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయ ఆవరణలో క్లస్టర్ ఇంచార్జ్, ఎంపీటీసీ నాలి శ్రీను ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ నాలి శ్రీను మాట్లాడుతూ.. మారుతున్న కాలగుణంగా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, చెట్లను పెంచడం వల్ల మానవాళికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అలాగే సచివాలయ సిబ్బంది, స్థానికులు కలిసి కార్యాలయ పరిసరాల్లో పలు రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో:మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోట బాలు,స్థానిక నాయకులు దగ్గుమిల్లి, ఆంజనేయులు, జువ్వ సాయి, శ్రీను, నాగరాజు,పంచాయతీ మరియు సచివాలయ సిబ్బంది, స్థానిక ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## - పురపాలక కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక 1వ వార్డులోని ఇండోర్ స్టేడియం ఆవరణలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్టేడియం పరిసరాలను శుభ్రపరిచి, చెత్తను తొలగించి, ఆవరణలో వేప, రావి, కానుగ లాంటి నీడనిచ్చే, ఆక్సిజన్ అందించే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పరిసరాలను పచ్చదనంతో నింపితేనే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించగలమని సూచించారు. పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని కూడా పెంచాలన్నారు. ఇండోర్ స్టేడియాన్ని జిల్లాలోనే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ, మేనేజర్ రవి సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లు, పర్యావరణ ఇంజనీర్, శానిటేషన్ మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.






# అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు

## - వైఎస్సార్ సీపి నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు






**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామిలిచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వడ్డి రఘురాం నాయుడు విమర్శించారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాథపురంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో టీడీపీ మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 రకాల హామీలు ఇచ్చారని, ఈ సూపర్ సిక్స్‌లో అమలవుతున్న ఒకటి, రెండు పథకాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేసి అదనపు సర్వీసులు ఏర్పాటు చేయక పోవడంతో రద్దీ కారణంగా చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులను పూర్తిగా దగా చేశారన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏం మాట్లాడాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నాడని ఎద్దేవాచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పల్లెల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

## - మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అక్కల రామమోహన్ రావు (గాంధీ ) ఆధ్వర్యంలో ఆత్మీయ ఆహ్వానం

## - - జనసేన జెండాలు, నినాదాలతో హోరెత్తిన ఇబ్రహీంపట్నం, మూలపాడు

**- ఇబ్రహీంపట్నం, జూన్ 05 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని మూలపాడు గ్రామానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు జనసేన శ్రేణులు బ్రహ్మరథం పట్టాయి. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయనకు అత్యంత ఘనంగా, ఆత్మీయ స్వాగతం పలికారు.మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామమోహన్ రావు (గాంధీ) నేతృత్వంలో పార్టీ శ్రేణులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించాయి. పవన్ కళ్యాణ్ రాకతో ఇబ్రహీంపట్నం, మూలపాడు గ్రామ పరిసరాలు జనసేన జెండాలతో రెపరెపలాడాయి. “సీఎం సీఎం“ మరియు “జై జనసేన“ అంటూ జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. తమ ప్రియతమ నాయకుడిని చూసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడంతో కార్యకర్తల్లో మునుపెన్నడూ లేని ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా అక్కల రామమోహన్ రావు (గాంధీ) మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వంటి పవిత్రమైన రోజున పవన్ కళ్యాణ్ గారు మన నియోజకవర్గానికి రావడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ప్రకృతిని కాపాడుకుంటూనే, గ్రామీణాభివృద్ధిని సాధించడం మరియు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో మైలవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, పవన్ కళ్యాణ్ అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# జూన్ 9 ధర్నాను జయప్రదం చేయాలి

## - సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు





**పోలవరం జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్ )**

పోలవరం మండలం వింజరం గ్రామంలో నిర్వహించిన సిపిఎం విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల భారం వల్ల సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రజలపై పన్నుల భారం మోపుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రైతులు, కార్మికులు, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో జూన్ 9న నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆర్. లింగరాజు పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఎల్‌టీఆర్ (1/70) చట్టం, అటవీ హక్కుల చట్టాల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఆదివాసీల భూమి, అటవీ హక్కులను పరిరక్షించేందుకు రూపొందించిన ఎల్‌టీఆర్ (1/70) చట్టం, అటవీ హక్కుల చట్టం (ఎఫ్ ఆర్ ఏ -2006)లను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా నిరోధించేందుకు తీసుకొచ్చిన 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనేక ప్రాంతాల్లో చట్ట ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అక్రమ భూకబ్జాలు, భూముల బదలాయింపులు, ఆదివాసీలను వారి సంప్రదాయ భూముల నుంచి దూరం చేసే చర్యలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం వ్యక్తిగత, సామూహిక హక్కులను గుర్తించి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా, వేలాది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అటవీ సంపదపై ఆదివాసీల హక్కులను గౌరవించకుండా అధికార యంత్రాంగం వ్యవహరించడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఆదివాసీల భూమి, అటవీ, జీవన హక్కులను పరిరక్షించేందుకు ఎల్‌టీఆర్ (1/70) చట్టం, అటవీ హక్కుల చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను వెంటనే పరిష్కరించాలని, అర్హులైన ప్రతి ఆదివాసీ కుటుంబానికి హక్కుల పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం సిపిఎం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. జులై 3,4,5తేదీలలో ఏలూరులో జరిగేఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏ ఐ కె ఎస్ )రాష్ట్ర 23వ మహాసభల విజయవంతం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలనీ సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు మడివి చలపతిరావు, గోకూరి పాండవులు, తాటి శాంతి, దర్ముల లక్ష్మి,డి సుబ్బయమ్మ,ఎం రాంబాబు, జి రామకృష్ణ, ఎం వీరాయమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గూటాల ఎత్తిపోతల నిర్వహణ బాధ్యతలు

## - కరీబండి శ్రీనివాసరావుకు రైతుల ఏకగ్రీవ తీర్మానం

**పోలవరం, జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్):**

గూటాల ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధిలోని రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. పథక నిర్వహణ బాధ్యతలను కరీబండి శ్రీనివాసరావుకు అప్పగిస్తూ ఆయకట్టు రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శుక్రవారం గూటాల ఎత్తిపోతల పథకం ప్రాంగణంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు రైతులంతా ఏకతాటిపైకి వచ్చారు.

ఈ సమావేశానికి పాత పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాల లంక ప్రాంతాలకు చెందిన ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాబోయే ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించే అంశంపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు.

గతంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం నిర్వహణలో కరీబండి శ్రీనివాసరావు అందించిన విశేష సేవలను ఈ సందర్భంగా రైతులు గుర్తుచేసుకున్నారు. ఆయన అనుభవం, నిబద్ధత ప్రస్తుతం ఎంతో అవసరమని పేర్కొంటూ.. రాబోయే సీజన్లలో కూడా ఆయనే స్వచ్ఛందంగా ఈ పథక నిర్వహణ బాధ్యతలను చేపట్టాలని రైతులందరూ కోరారు.

రైతుల విజ్ఞప్తులను, ప్రాంతీయ సాగునీటి అవసరాలను పరిశీలించిన అనంతరం జనరల్ బాడీ సమావేశం ఈ తీర్మానానికి ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సమావేశంలో పాల్గొన్న పలువురు రైతులు తీర్మాన పత్రంపై సంతకాలు చేసి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. రైతులందరి ప్రయోజనాలను, పంటల సంరక్షణను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైతు ప్రతినిధులు వెల్లడించారు.





# రైతులు వ్యవసాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్







**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే రైతులు వ్యవసాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సుస్థిర ఉద్యానం - సుభిక్ష ఫల సాయం అనే అంశంపై శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.ధనుంజయ రావు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యాన విశ్వవిద్యాలయం రైతులకు ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని అందిస్తుందని, శాస్త్రవేత్తల సలహాలను అందిపుచ్చుకొని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. ఉద్యాన విశ్వవిద్యాలయంలో రైతుల ఉన్నతి కోసమే ఈ రైతు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు అనేక అవస్థలు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతుల సమస్యలు అన్నింటిని పరిష్కరించిందన్నారు. రైతుల సంక్షేమమే దేశానికి క్షేమమనే విశ్వాసంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. రైతులను , ఎస్సీ, బిసి, తదితర అన్ని వర్గాల ప్రజలను మోసంచేసి ఇప్పుడు వెన్నుపోటు అంటూ రోడ్లపై ధర్నాలు చేయటం తగదన్నారు. .దోపిడీ ప్రభుత్వానికి, మంచి పరిపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని వివరించారు. వర్శిటీ ఉపకులపతి ధనుంజయరావు మాట్లాడుతూ విశ్వ విద్యాలయం అభివృద్ధికి రూ.17 కోట్లకు పైగా నిధులు అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని అందిస్తున్నామని వివరించారు. ఆధునిక విజ్ఞానం, సాంకేతికత, కృత్రిమ మేదస్సు, డ్రోన్ టెక్నాలజీ, స్వయంచాలిత పరికరాల వినియోగం వంటి అంశాలతో పాటు, వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం గురించి లాభసాటి విధానాల గురించి విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగుమందులు తదితర కంపెనీల స్టాల్స్ రైతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాస్త్ర వేత్తలు, యూనివర్సిటీ అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తున్న 'అక్షర' స్కూల్‌పై చర్యలు తీసుకోండి

## - డీఈఓ ఎం. వెంకటలక్ష్మికి పి.డి.ఎస్.యు వినతిపత్రం

**ఏలూరు, జూన్ 5: (నేషనలిస్ట్ వాయిస్)**

జీవో ఎంఎస్ నెంబర్ 1కి విరుద్ధంగా, విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ నడుస్తున్న ఆర్.ఆర్.పేటలోని 'అక్షర' స్కూల్ యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యు డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పి.డి.ఎస్.యు ప్రతినిధుల బృందం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం. వెంకటలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ.. ఆర్.ఆర్.పేట శంకరమఠం రోడ్డులో ఉన్న అక్షర స్కూల్ యాజమాన్యం తీరు తీవ్ర వివాదాస్పదంగా మారిందని మండిపడ్డారు. ప్రభుత్వ రికార్డులు, సర్టిఫికెట్లలో 'అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్' అని రిజిస్ట్రేషన్ చేయించుకుని, బయట ప్రచారంలో మాత్రం 'అక్షరా గ్లోబల్ స్కూల్' అని వాడుతూ విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కారని నాని ఆరోపించారు. పాఠశాల నడుస్తున్న భవనం చుట్టుపక్కల ఆసుపత్రులు, షాపింగ్ మాళ్లు ఉండటం వల్ల క్లాస్ రూములకు కనీస వెంటిలేషన్ లేదన్నారు. ఏసీ క్లాస్ రూముల పేరుతో విద్యార్థులను ఇరుకు గదుల్లో ఉంచుతున్నారని, అత్యవసర సమయాల్లో బయటకు వచ్చేందుకు 'ఎమర్జెన్సీ ఎగ్జిట్' కూడా లేకపోవడం దారుణమన్నారు. పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి చాలా ఇరుకైనదని, భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయని నాని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన అధికారులను ప్రశ్నించారు. 2025లో ఈ పాఠశాలకు హైస్కూల్ పర్మిషన్ తెచ్చే క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా నకిలీ డాక్యుమెంట్లు సమర్పించినట్లు తెలుస్తోందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలోనూ ఈ పాఠశాల అక్రమాలపై పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏలూరులో 'అక్షర' పేరుతో నడుస్తున్న అన్ని పాఠశాలల అనుమతులపై సమగ్ర విచారణ జరిపి, విద్యార్థుల భవిష్యత్తును, ప్రాణాలను కాపాడాలని కాకి నాని అధికారులను కోరారు..




# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్మానించిన టీపీసీసీ ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద కుమార్ రెడ్డి...





**దేవరకద్ర జూన్ 5 నేషనలిస్ట్ వాయిస్**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిశీలన సమీక్ష సమావేశానికి శుక్రవారం హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సమక్షంలో టిపిసిసి ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, శాలువాతో సన్మానించారు. అలాగే రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్రవరంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## - మొక్కలు నాటిన నాయకులు, అధికారులు



**టి. నర్సాపురం జూన్ 5(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం వీరభద్రవరం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే నినాదంతో గ్రామంలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టి. నర్సాపురం ఎమ్మార్వో టి. సాయిబాబా పాల్గొనడం జరిగింది అలాగే ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరరావు మరియు ఎమ్మార్వో సాయిబాబా సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామ పరిసరాల్లో మొక్కలను నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత గ్రామీణులపై ఉందంటూ ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. "రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని, మెరుగైన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం." అని తెలుగుదేశం పార్టీ నాయకులు శీలం వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# దళితుల శ్మశాన గోరీల కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ జిల్లా గోపాల పురం గ్రామంలో ఊర చెరువు అభివృద్ధి పనుల పేరుతో దళితుల శ్మశాన గోరీ లను కూల్చివేయడాన్ని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్య క్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుంచు రాజేందర్ ఖండించారు. శుక్రవారం బాధిత కుటుంబాలతో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి వందేళ్లుగా ఉన్న దళితుల సమాధులను ధ్వంసం చేసిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు కోల్పోయి న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, అభివృద్ధి పేరుతో జరుగుతు న్న విధ్వంసాన్ని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాధిత దళిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వర్షానికి కూలిపోయిన ఇంటి పైకప్పు

**దేవరకద్ర జూన్ 5 నేషనలిస్ట్ వాయిస్**



దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో శు క్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 11వ వార్డు చెందిన బుడే సాబ్ ఇంటి పైకప్పు కూలిపోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ రాధా కొండల్ సందర్శించి వారికి సహాయ సకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

## - కొత్త పెన్షన్లు, గృహ నిర్మాణాలకు ప్రాధాన్యం

## - గ్రామ త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా త్వరలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం





**నందిగామ, జూన్ 05 (నేషనలిస్ట్ వాయిస్):**

నందిగామ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. శుక్రవారం నాడు నియోజకవర్గ పరిధిలోని మునగచర్ల గ్రామంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై, తమకు ఎదురవుతున్న పలు సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి అర్జీలను అందజేశారు.

గ్రామస్తుల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. ప్రజల ముంగిటకే పాలనను తీసుకువెళ్లడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నామని, అర్జీలన్నింటినీ పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే ప్రకటించిన ముఖ్యమైన అంశాలు ప్రకారం కొత్త పెన్షన్లు, ఇళ్ల నిర్మాణం: గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు, గృహ నిర్మాణ పథకాలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరడమే లక్ష్యమని చెప్పారు.

మునగచర్ల గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని నొక్కి చెప్పారు. ఇందులో భాగంగా త్వరలోనే గ్రామంలో సరికొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

అలాగే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు మరియు మునగచర్ల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారుల అభివృద్ధి లోపాలను ముందస్తుగా గుర్తించాలి

## - అంగన్‌వాడీ కార్యకర్తలకు 'నవచేతన' శిక్షణ ప్రారంభం






**కుక్కునూరు, జూన్ 5(నేషనలిస్ట్ వాయిస్)**

చిన్నారుల్లో ఉండే శారీరక, మానసిక అభివృద్ధి లోపాలను ముందస్తుగానే గుర్తించి, వారికి తగిన సంరక్షణ అందించడమే ధ్యేయంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఐసిడిఎస్ ఏలూరు జిల్లా, కుక్కునూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు రోజుల పాటు నిర్వహించే 'నవచేతన' శిక్షణా కార్యక్రమం శు క్రవారం ఘనంగా ప్రారంభమైంది. జూన్ 5, 6 తేదీల్లో జరిగే ఈ శిక్షణలో చిన్నారుల ప్రారంభ బాల్యాభివృద్ధి, పోషణ సంరక్షణ, మరియు నవచేతన స్క్రీనింగ్ విధానాలపై కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా ప్రాజెక్ట్ సిడిపిఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ, 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమైందని కొనియాడారు. అలాగే "పిల్లల మెదడు ఎదుగుదలలో 80 శాతం మొదటి మూడు సంవత్సరాల లోనే పూర్తవుతుంది. అలాగే, 90 శాతం ఎదుగుదల ఆరు సంవత్సరాల లోపే జరుగుతుంది. కాబట్టి, ఈ వయసులోనే పిల్లల ఆరోగ్యం, పోషణ, భద్రత, ప్రారంభ అభ్యసన మరియు స్పందనాత్మక సంరక్షణపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి." అని అనంతలక్ష్మి, సిడిపిఓ తెలిపారు.

అలాగే కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అనిషా మాట్లాడుతూ.. 'నవచేతన' కార్యక్రమం ద్వారా మొబైల్ ఆధారిత డిజిటల్ సాధనం (యాప్) సహాయంతో పిల్లల్లోని లోపాలను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఐదు ప్రధాన విభాగాలలో పిల్లలను స్క్రీనింగ్ చేయాల్సి ఉంటుందని ఆమె వివరించారు:స్థూల చలనం, సూక్ష్మ చలనం, భాషా వికాసం, జ్ఞాన వికాసం, సామాజిక-భావోద్వేగ అభివృద్ధి ఈ ఐదు విభాగాల్లో పిల్లలను నిశితంగా పరిశీలించి స్క్రీనింగ్ చేయడం ద్వారా, లోపాలు ఉన్నట్లు తేలితే వారికి సకాలంలో వైద్య సేవలు అందించి సరిదిద్దవచ్చని డాక్టర్ అనిషా పేర్కొన్నారు.

యాప్ వినియోగంపై ప్రత్యక్ష శిక్షణ

అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రుక్మిణి అంగన్‌వాడీ కార్యకర్తలకు 'నవచేతన' యాప్ వినియోగించే విధానాన్ని, స్క్రీనింగ్ ప్రక్రియను మరియు పిల్లల అభివృద్ధి సూచికలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కుక్కునూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ చరిత్రలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది

## - తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు





**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సువర్ణ అధ్యయంగా నిలిచిపోతుందని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) కితాబిచ్చారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని 13 వారాలుగా నిర్వహిస్తున్నామని, మధ్యలో పార్టీ కార్యక్రమాలు ఉండటం వల్ల ఒకటి, రెండు నిర్వహించలేకపోయామని చెప్పారు. పింఛన్లకు సంబంధించి ఎక్కువ దరఖాస్తులొచ్చాయని, వాటిని కమిషనర్, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ నెల 12 తరువాత ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరుచేసే అవకాశం ఉందన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం చాలా ఉన్నతమైన కార్యక్రమమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కూటమి ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ 4 వేలు, వికలాంగులకు రూ 6 వేలు, కిడ్నీ బాధితులకు రూ 10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ 15 వేలు చొప్పున ఇస్తుందన్నారు. తెలంగాణ, హర్యానాలో రూ 2 వేలు చొప్పున ఇస్తుండగా, మిగిలిన రాష్ట్రాల్లో రూ 500 నుంచి రూ వెయ్యి మధ్యనే ఇస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఒకటో తేదీ తెల్లవారుజామున లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. ఇంటికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ బృహత్తర కార్య క్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, ఇందుకు మిత్రపక్షాలైన జనసేన భాజపా పూర్తిగా సహక రిస్తున్నాయని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారీగా నిధులిస్తుండటంతో ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయగలుగుతున్నామని వివరించారు.

### ఘనంగా కిలపర్తి వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు

తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ బాబ్జి అధ్యక్షతన తెదేపా పెంట పాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు పుట్టినరోజు వేడుకలను స్థానిక పార్టీ కార్యా లయంలో ఘనంగా నిర్వహించారు. బాబ్జి, వెంకట్రావును పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించడంతో పాటు కేక్ కట్ నుంచి నాయకులకు తిని పించారు. ముందుగా బాబ్జీ తోపాటు పలువురు తెలుగు నాయ కులు వెంకట్రావు హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, ముప్పిడి రమేష్, కాకర్ల సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# మీ వాహనం ఎల్ఈడీ లైట్.. ఎదుటివారి ప్రాణాలకి గండం!

- హెల్మెట్ లేని ప్రయాణం.. కుటుంబానికి తీరని శోకం!
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా, చట్టపరమైన చర్యలు తప్పవు:
- టీ. నరసాపురం ఎస్ఐ జయబాబు హెచ్చరిక

**టీ. నరసాపురం, జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్):**

రాత్రి వేళల్లో వాహనదారులు ఉపయోగించే మితిమీరిన కాంతివంతమైన ఎల్ఈడీ లైట్లు, మరియు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల రహదారి ప్రమాదాలు, ప్రాణనష్టాలు దారుణంగా పెరిగిపోతున్నాయని ఏలూరు జిల్లా టీ. నరసాపురం మండల సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) జయబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే "ప్రజా బాధ్యత – రహదారి భద్రత" అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన వాహనదారులకు పలు కీలక సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయబాబు మాట్లాడుతూ.. వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అమర్చే హై–బీమ్ ఎల్ఈడీ లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు.

తీవ్రమైన కాంతివంతమైన లైట్ల వల్ల కలిగే నష్టాలను ఎస్ఐ వివరించారు. ఎదురుగా వచ్చే వాహనాల ఎల్ఈడీ కాంతి కంటిపై పడటం వల్ల క్షణకాలం పాటు ఏమీ కనిపించని స్థితి (గుడ్డితనం ) ఏర్పడుతుందన్నారు. ఈ అకస్మాత్తు కాంతి వల్ల వాహనదారులు రోడ్డుపై నియంత్రణ కోల్పోయి ఘోర ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు కేవలం కంపెనీ వారు అందించిన ప్రామాణికమైన లైట్లను మాత్రమే వాడాలని, రాత్రి సమయాల్లో ఎదురుగా వాహనాలు వస్తున్నప్పుడు తప్పనిసరిగా డిప్పర్ (లో–బీమ్) ఉపయోగించాలని సూచించారు.

ఇదే క్రమంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని ఎస్ఐ జయబాబు హెచ్చరించారు. ప్రమాదం జరిగినప్పుడు తలకు తగిలే చిన్న గాయం కూడా ఒక కుటుంబంలో చీకట్లు నింపుతుందని, హెల్మెట్ ధరిస్తే 90 శాతం ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని ఆయన గుర్తుచేశారు. "మీరు క్షేమంగా ఇల్లు చేరడం కోసమే మీ కుటుంబ సభ్యులు వేచి చూస్తుంటారు. కాబట్టి హెల్మెట్ ధరించడం మీ కనీస బాధ్యత" అని స్పష్టం చేశారు. కేవలం బైక్ నడిపేవారే కాకుండా, వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించడం ఉత్తమమని పేర్కొన్నారు.

రహదారి నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇకపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ఐ జయబాబు స్పష్టం చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం అనుమతి లేని, అధిక కాంతినిచ్చే ఎల్ఈడీ లైట్లను అమర్చడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు పాటించని




వాహనదారులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు, వాహనాలకు ఉన్న అదనపు ఎల్ఈడీ లైట్లను అక్కడికక్కడే తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు.

"అవగాహనతో ప్రయాణించండి – సురక్షితంగా ఇల్లు చేరండి" అని పిలుపునిస్తూ, ప్రజల ప్రాణాల రక్షణ కోసమే టీ. నరసాపురం పోలీస్ యంత్రాంగం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# గోదావరి పుష్కర ఏర్పాట్లపై పోలీసుల ప్రత్యేక నిఘా

- 36 పుష్కర ఘాట్లను పరిశీలించిన పోలవరం సీఐ, ఎస్ఐ
- భక్తుల భద్రతే మా ప్రథమ లక్ష్యం: సీఐ బి. కృష్ణ కుమార్





**పోలవరం, జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్):**

గోదావరి పుష్కరాల నిర్వహణ నేపథ్యంలో పోలవరం మండలంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏలూరు జిల్లా పోలవరం మండలం సీఐ బి. కృష్ణ కుమార్, ఎస్ఐ పి. అప్పారావు స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని 36 పుష్కర ఘాట్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రద్దీ నియంత్రణ, వాహన పార్కింగ్, అత్యవసర సేవలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ కుమార్ మాట్లాడుతూ, పుష్కర ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నదిలో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అక్కడ లైఫ్ జాకెట్లు, రక్షణ సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. పుష్కరాల విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే భక్తులు సురక్షితంగా పుష్కర స్నానాలు ఆచరించేలా పోలీసు శాఖ జారీ చేసే సూచనలను ఖచ్చితంగా పాటించాలని ఎస్ఐ పి. అప్పారావు కోరారు. భద్రతా నియమాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి యు. రాజారావు, పట్టిసం ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజ్ కుమార్, ఎల్ఎన్డి పేట ఇంజనీరింగ్ అసిస్టెంట్ మడకం సురేష్, జనసేన పట్టిసం మండల ప్రధాన కార్యదర్శి కాకి అయ్యప్ప, ఫెర్రీ కాంట్రాక్టర్లు సత్యనారాయణ, కాకుమాళ్ళ మణికంఠ సతీష్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది స్వామి, బుల్లిరాజు, రమేష్, సతీష్, మరియు మహిళా పోలీస్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి బాగుంటేనే మానవ మనుగడ సాధ్యం

- పర్యావరణాన్ని నాశనం చేసే పనులకు స్వస్తి పలకాలి:
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేత కూరం సంజీవరావు
- మొక్కలు నాటిన గ్రామస్తులు

**కుక్కునూరు జూన్ 5 (నేషనలిస్ట్ వాయిస్):**




ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుందని, ప్రకృతిని నాశనం చేసే పనులకు మనుషులు స్వస్తి పలకాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు కూరం సంజీవరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం రెడ్డిగూడెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, మాధుర్య హనీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో కూరం సంజీవరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సృష్టిలో సమస్త జీవకోటికి మొక్కలే ప్రధాన జీవనాధారమని ఆయన స్పష్టం చేశారు. ఆహారం, నీరు లేకపోయినా మనిషి ఒకటి రెండు రోజులు జీవించగలడేమో కానీ, ప్రాణవాయువు (ఆక్సిజన్) లేకపోతే ఒక్క నిమిషం కూడా బతకలేడని గుర్తుచేశారు. అటువంటి అమూల్యమైన ప్రాణవాయువును అందించే చెట్లను నరకడం, అడవులను నాశనం చేయడం అత్యంత విచారకరమన్నారు. ఇటీవలి కాలంలో అడవులకు నిప్పు పెట్టడం, విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వంటి చర్యల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని సంజీవరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సామాజిక నష్టాలను అరికట్టడం కేవలం అధికారుల వల్లే సాధ్యం కాదని, ఇందులో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి పల్లెలోనూ, ప్రతి కుటుంబంలోనూ అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎఫ్పీఓ నిబంధనలకు లోబడి పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాధుర్య హనీ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, స్థానిక గిరిజన మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పర్యావరణాన్ని రక్షిస్తామని ఘనంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలోని పలు వీధులు, ఖాళీ ప్రదేశాలలో పెద్ద ఎత్తున మొక్కలను నాటారు.

# ఎమ్మెల్యే నియోజకవర్గంలో కరెంటు కోతలు.. స్పందించని విద్యుత్ అధికారులు..

**దేవరకద్ర జూన్5 నేషనలిస్ట్ వాయిస్**

దేవరకద్ర స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గం కేంద్రంలో శుక్రవారం అకాల వర్షంతో గంటకు పైగా కరెంటు తీయడం జరిగింది. వర్షం బందు అయినా కూడా విద్యుత్ అధికారులు కరెంటు సప్లై ఆన్ చేయలేదు. ఎమ్మెల్యే నియోజకవర్గం కేంద్రంలో కరెంటు కోతలు ఎక్కువ కరెంటు తక్కువగా ఉన్నదని ప్రజలు అంటున్నారు. కరెంట్ విషయంపై విద్యుత్ అధికారులు ఏమాత్రం స్పందించబడలేదు. విద్యుత్ లైన్మెన్లు కూడా వారి ఇష్టం వచ్చినట్లు ఎవరెవరుతో ఫోన్లో మాట్లాడుతున్నారు . ప్రజలు ఫోన్ చేసినా కూడా కనీసం లైన్మెన్ కానీ విద్యుత్ అధికారులు కానీ స్పందించడం లేదని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. పల్లెటూర్లో కరెంటు ఉంటది కాని దేవరకద్ర నియోజకవర్గం నియో జకవర్గం కేంద్రంలో కరెంటుమాత్రం ఉండదు అని ప్రజలు అంటున్నారు.

# భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



భవిష్యత్ తరాలకు స్వచ్ఛ మైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ పేర్కొన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రపంచ పర్యావర ణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని శు క్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాల యంలో నిర్వహించిన కార్య క్రమంలో పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుం డటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగు తుండటం, వాహనాలు పారి శ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమ తుల్యత దెబ్బతింటోందన్నా రు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటు న్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవ డం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని పేర్కొన్న ఆయన, పర్యావరణ పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల ని పిలుపునిచ్చారు. విస్తృత స్థాయిలో మొక్కలునాటడం, వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమై న, ఆరోగ్యకరమైన పర్యావర ణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నర్సింహారావు, నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పోస్టాఫీసులో ఘనంగా పర్యావరణ దినోత్సవం

- జిల్లా సూపరిటెండెంట్ ఆఫ్ పోస్ట్ వెంకటేశ్వర్లు..

**దేవరకద్ర జూన్ 5 నేషనలిస్ట్ వాయిస్**

దేవరకద్ర మున్సిపాలిటి కేంద్రంలోని ఉప తపాలా కేంద్రాన్ని సూపరిటెండెంట్ ఆఫ్ పోస్ట్ (ఎస్పీ) వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించారు. ఆగస్ట్ నెల నుండి ఆసరా ఫించన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే ఎంఓ,ఎస్పీఎం,బిపిఎం,ఏబిపిఎంలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పింఛన్ దారులకు పిఓఎస్బి ఖాతాలను తెరవగలరని ఎస్పీ సూచించారు. అదే విధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు తపాలా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ కాలుష్యాన్ని నివారించే దిశగా అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ సిబ్బంది వారు తదితరులు పాల్గొన్నారు.





# జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి రాహుల్

న్యూచండీగఢ్‌లో జరుగుతున్న ఈ చారిత్రాత్మక మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడారు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్టు కలయికపై ఆయన కొన్ని కీలక సంకేతాలు ఇచ్చారు. ఆ సూచనల ఆధారంగా అఫ్గానిస్తాన్‌తో తలపడే భారత్ అంచనా తుది జట్టు ఇలా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారతదేశం తరఫున అత్యుత్తమ స్థానంలో ఉన్న ఈ యువ ఓపెనర్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ఖాయమైంది. జైస్వాల్‌తో కలిసి రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌కు అతడిని టీమిండియా వైస్ కెప్టెన్‌గా కూడా మేనేజ్‌మెంట్ నియమించింది. ఎడమచేతి వాటం బ్యాటర్ సాయి సుదర్శన్ నంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉందని కోచ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ఐపీఎల్ 2026లో 722 పరుగులతో సూపర్ ఫామ్‌లో ఉన్న సుదర్శన్, అదే జోరును టెస్టుల్లోనూ కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు.జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన రెగ్యులర్ స్థానమైన నంబర్ 4లో బ్యాటింగ్‌కు రానున్నాడు. మెడ గాయం  కారణంగా గువాహటిలో సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్టుకు దూరమైన గిల్.. ఇప్పుడు పూర్తిగా కోలుకుని జట్టులోకి పునరాగమనం చేస్తున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ నంబర్ 5లో బరిలోకి దిగనున్నాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగే ఈ మ్యాచ్ పంత్‌కు కెరీర్‌లో 50వ టెస్ట్ కావడం విశేషం. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. బ్యాట్, బాల్ రెండింటితోనూ రాణించాలని ఈ యువ ఆటగాడు చూస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సుందర్ తుది జట్టులో ఉంటాడు. విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబే.. మానవ్ సుతార్‌ను కాదని న్యూచండీగఢ్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి.ఐపీఎల్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పటికీ, కుల్దీప్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. రవీంద్ర జడేజా అందుబాటులో లేకపోవడంతో భారత స్పిన్ విభాగాన్ని అతడే ముందుండి నడిపించనున్నాడు.

# ఘోరంగా విఫలమైన లివింగ్ స్టోన్



ఐపీఎల్ 2026 మెగా వేలంలో ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ ఇంగ్లాండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌ను ఏకంగా రూ. 13 కోట్లకు సొంతం చేసుకుంది. మిడిల్ ఆర్డర్‌లో అతడు సిక్సర్ల వర్షం కురిపిస్తాడని ఫ్రాంచైజీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ, తీరా ఐపీఎల్ 2026 సీజన్ ముగిసేసరికి కావ్య మారన్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంత పెద్ద తప్పో అర్థమైందని క్రికెట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సీజన్‌లో లివింగ్ స్టోన్ ఘోరంగా విఫలమయ్యాడు. సన్‌రైజర్స్ తరఫున కేవలం రెండంటే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే అతడికి ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగే అవకాశం దక్కింది. ఆ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి అతడు చేసింది కేవలం 15 పరుగులు మాత్రమే. మిగిలిన బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్న వేళ లివింగ్ స్టోన్ తడబడటంతో, మేనేజ్‌మెంట్ అతడిని మిగతా మ్యాచ్‌లన్నింటికీ బెంచ్‌కే పరిమితం చేయాల్సి వచ్చింది. అయితే ఐపీఎల్ ముగిసిన తర్వాత లివింగ్ స్టోన్ సన్ రైజర్స్ హైదరాబాద్‌పై సంచలన కామెంట్స్ చేశాడు. తమ తుది జట్టు ఎంపికలో యాజమాన్యం జోక్యం ఉంటుందని లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. కేవలం ముగ్గురే విదేశీ క్రికెటర్లను ఆడించిన ఫ్రాంచైజీ.. తనకు అవకాశాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నాడు.అతడికి వేలంలో దక్కిన ధర (రూ. 13 కోట్లు), అతడు చేసిన పరుగులను (15 రన్స్) పోల్చి చూస్తూ సోషల్ మీడియాలో నెటిజన్లు దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. దాదాపు ఒక్కో పరుగుకు కోటి రూపాయల చొప్పున లివింగ్ స్టోన్ వసూలు చేశాడంటూ కామెంట్లు పెడుతున్నారు.

# వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం!




భారత బ్యాటింగ్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ క్రికెట్ అభిమానులకు గట్టి షాక్ ఇచ్చారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా అఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ మొత్తానికి ఆయన దూరమయ్యారు. ఈ విషయాన్ని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ గురువారం (జూన్ 4) వెల్లడించింది. ఇటీవల ఆదివారం (మే 31) జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గుజరాత్ టైటాన్స్‌పై 42 బంతుల్లో 75 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న 37 ఏళ్ల కోహ్లీ.. అదే మ్యాచ్‌లో గాయపడ్డారు. ఫలితంగా అఫ్ఘనిస్తాన్‌తో భారత్ ఆడబోతున్న మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో ఆయన భాగం కాలేకపోతున్నారు.హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా కోహ్లీ వన్డే సిరీస్‌కు దూరం కావలసి వచ్చింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లోనే ఆయనకు ఈ గాయమైంది. స్కానింగ్ రిపోర్టులలో ఆయనకు 'డిస్టల్ సెమీమెంబ్రానోసస్ టెండన్ టియర్'అయినట్లు తేలింది" అని బీసీసీఐ  వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. ఇది మోకాలి వెనుక భాగం కింద ఉండే హ్యామ్‌స్ట్రింగ్ కండరాలను అనుసంధానించే దట్టమైన నరానికి సంబంధించిన ఒక అరుదైన గాయం. అయితే కోహ్లీ గాయంపై మరియు సిరీస్ నుండి ఆయన తప్పుకోవడంపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ దూరం కావడంతో ఆయన స్థానంలో యశస్వి జైస్వాల్ లేదా రుతురాజ్ గైక్వాడ్‌లను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. న్యూజీలాండ్‌తో జరిగిన గత వన్డే సిరీస్‌లో జైస్వాల్ జట్టులో ఉన్నప్పటికీ ఆడే అవకాశం రాలేదు. మరోవైపు గైక్వాడ్ గత ఏడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో మిడిల్ ఆర్డర్‌లో ఆకట్టుకున్నాడు. అయితే, ప్రస్తుతం గైక్వాడ్ శ్రీలంకలో జరగబోయే త్రైపాక్షిక సిరీస్ కోసం 'ఇండియా ఎ' జట్టులో ఉన్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను మే 19నే ఈ చారిత్రక హోమ్ సిరీస్ కోసం ఎంపిక చేశారు. అయితే ఐపీఎల్ 2026లో హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడిన రోహిత్.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడతాడనే నిబంధనతో జట్టులోకి తీసుకున్నారు. ఆయన ఈ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇంకా చూడాల్సి ఉంది.

# లార్డ్స్‌లో న్యూజిలాండ్ 113కే ఆలౌట్..

లార్డ్స్ మైదానం వేదికగా జరుగుతున్న ఇంగ్లండ్ – న్యూజిలాండ్ మొదటి టెస్టు ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 140 పరుగులకు ఆలౌట్ కాగా.. న్యూజిలాండ్ 113 పరుగులకే పది వికెట్లు కోల్పోయింది. 65/6తో రెండో రోజు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయింది. ఫిలిప్స్ అవుటయినప్పటికీ న్యూజిలాండ్ టెయిలెండర్స్ రాణించడం విశేషం. కైల్ జెమీసన్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఇంగ్లండ్ – న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న లార్డ్స్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. ఈ టెస్టులో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్ 140 పరుగులకే ఆలౌట్ చేసింది. ఇంగ్లండ్ కూడా అదే జోష్‌తో న్యూజిలాండ్ ఆరు వికెట్లు పడగొట్టింది. తొలి రోజే ఇరు జట్లు 16 వికెట్లు కోల్పోయింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 65/7తో ముగించింది. రెండో రోజు ఆట ప్రారంభమైన తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయాడు. ఇంగ్లండ్ బౌలర్ జోష్ టంగ్ తొలి బంతికే ఫిలిప్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ 80 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసుకున్న జెమీసన్.. బ్యాట్‌తో కూడా రెచ్చిపోవడంతో న్యూజిలాండ్ 100 పరుగులు దాటేసింది. జెమీసన్‌కు తోడు నాథన్ స్మిత్ కూడా రాణించాడు. ఆఖర్లో వరుస వికెట్లు పడటంతో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోర్‌కు 27 పరుగుల దూరంలో కివీస్ ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోర్ 65/7 స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కి వచ్చిన న్యూజిలాండ్ జట్టు తొలి సెషన్‌లోనే ఆలౌట్ అయింది. గ్లెన్ ఫిలిప్స్ 65 పరుగుల వద్ద అవుటైన తర్వాత న్యూజిలాండ్ టెయిలెండర్స్ 48 పరుగులు జోడించడం విశేషం.





# టీమిండియా కొత్త కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్?:

ఇండియా టీ20 క్రికెట్ లో మరో సంచలన మార్పుకు తెర లేవనుంది. టీ20 వరల్డ్ కప్ 2026 టైటిల్ గెలిచిన కొద్ది నెలలకే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తప్పించడానికి బీసీసీఐ సిద్ధమైంది. అప్కమింగ్ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లకు కొత్త కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు తీసుకోనున్నట్లు పలు కథనాల్లో వెల్లడైంది. ఆన్‌లైన్ లో జరగబోయే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లో ఈ డెసిషన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారు. సూర్య స్థానంలో నాలుగో నంబర్ బ్యాటర్ గా, లీడర్ గా శ్రేయస్ ను నియమించాలనే నిర్ణయం ఆల్రెడీ జరిగిపోయింది. అలాగే అక్షర్ పటేల్ ప్లేస్ లో యంగ్ ప్లేయర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్ గా ప్రమోట్ చేయనున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో సంజూ శాంసన్ ను టీ20 కెప్టెన్ చేయాలని గట్టిగా కోరుకున్నట్లు సమాచారం. అయితే బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దీనికి అంగీకరించలేదు. సెలెక్షన్ కమిటీలోని ఇతర మెంబర్స్ కూడా గంభీర్ ప్రతిపాదనతో విభేదించారు. శాంసన్ కెరీర్ లో కన్సిస్టెన్సీ లేకపోవడమే దీనికి మెయిన్ రీజన్ అని వాళ్లు భావించారు. వరల్డ్ కప్ గెలిపించడంలో సంజూ కీలక పాత్ర పోషించినప్పటికీ, అతడిని లాంగ్ టర్మ్ కెప్టెన్సీ ఆప్షన్ గా సెలెక్టర్లు చూడటం లేదు. అంత పెద్ద రెస్పాన్సిబిలిటీ ఇవ్వడానికి ఇది సరైన టైమ్ కాదని సెలెక్టర్లు స్పష్టం చేశాడు.వరల్డ్ కప్ విన్నింగ్ స్క్వాడ్ లో లేని శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ లో మాత్రం అద్భుతంగా రాణించాడు. ఐపీఎల్ 2025 లో పంజాబ్ కింగ్స్ ను ఫైనల్స్ కు తీసుకెళ్లిన శ్రేయస్, రీసెంట్ గా ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ లో కూడా బ్యాట్ తో మెరిశాడు. పంజాబ్ టీమ్ ప్లే ఆఫ్స్ చేరనప్పటికీ, శ్రేయస్ 14 మ్యాచుల్లో 168.81 స్ట్రైక్ రేట్ తో 498 రన్స్ చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ సాలిడ్ పర్ఫార్మెన్స్ వల్లే అతడికి కెప్టెన్సీ ఛాన్స్ దక్కింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరుసగా రెండు సార్లు ఐపీఎల్ చాంపియన్ గా నిలిపి, బ్యాటింగ్ లో కూడా ఇరగదీసిన రజత్ పాటిదార్ పేరును మాత్రం సెలెక్టర్లు అస్సలు కన్సిడర్ చేయలేదు. లీడర్ షిప్ రేస్ లో అతడికి చోటు కల్పించడంపై ఎలాంటి డిస్కషన్ జరగలేదని సోర్సెస్ ద్వారా తెలిసింది. కేవలం శ్రేయస్ అయ్యర్ ను మెయిన్ లీడర్ గా ప్రొజెక్ట్ చేస్తూ టీమ్ ను ఫ్యూచర్ కోసం బిల్డ్ చేయాలని బోర్డు భావిస్తోంది. త్వరలోనే ఈ లైనప్ పై అఫీషియల్ ప్రెస్ నోట్ రానుంది.

# సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడు

**టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**



అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్ట్‌లో సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇప్పటి వరకు అతనికి ఎక్కువ అవకాశాలు రాలేదని చెప్పాడు. అంతేకాకుండా ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడని గుర్తు చేశాడు. న్యూ చండీగఢ్ వేదికగా శనివారం నుంచి అఫ్గానిస్థాన్, భారత్ మధ్య ఏకైక టెస్ట్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం టీమిండియా సన్నాహకాలను పూర్తి చేసుకుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం గౌతమ్ గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. టీమ్ కాంబినేషన్ గురించి ప్రశ్నించగా.. సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడని స్పష్టం చేశాడు. తద్వారా దేవదత్ పడిక్కల్ బెంచ్‌కే పరిమితమవుతాడనే విషయాన్ని వెల్లడించాడు. 'సాయి సుదర్శన్‌కు ఇప్పటి వరకు తగిన అవకాశాలు రాలేదు. అతను ఇంగ్లండ్ పర్యటనలో కూడా ఆడాడు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అతనికి వరుస అవకాశాలు ఇవ్వాలనుకుంటున్నాం. మేం 11 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయగలం. సాయి సుదర్శన్ ఏం చెత్త ఫామ్‌లో లేదు.

# దూత వెబ్ సిరీస్‌కు నిర్మాతగా నాగచైతన్య

'దూత' వెబ్‌సిరీస్‌తో తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ఇప్పుడు ఈ హిట్ సిరీస్‌కు సీక్వెల్ సిద్ధమవుతోంది. శుక్రవారం పూజా కార్యక్రమాలు జరగ్గా.. నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సీక్వెల్‌కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. 'దూత సెకండ్ చాప్టర్‌లో నిర్మాతగా నా తొలి అడుగు' అంటూ నాగచైతన్య ఫొటోలు పంచుకున్నారు. మరోసారి మ్యాజిక్ చూడడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'దూత'.. 2023 డిసెంబరు 1న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఈ హారర్ మిస్టరీ థ్రిల్లర్‌లో జర్నలిస్టు సాగర్ వర్మ అవధూరిగా నాగచైతన్య ఆకట్టుకున్నారు.

# పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

## సరైన ప్రాధాన్యం లేదంటూ

## సోషల మీడియా పోస్ట్ జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం

నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ.135 కోట్లు వసూలు చేసింది.






# జననాగన్ మూవీ రిలీజ్ వ్యవహారం

## థియేట్రికల్ ఒప్పందాలు రద్దు చేసుకున్నట్లు వార్తలు

ఈ ఏడాది ప్రారంభం నుంచి వార్తల్లో ఉన్న చిత్రం 'జననాయగన్'. తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ చివరి సినిమాగా రూపొందిన 'జననాయగన్' సెన్సార్ కారణంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్, నాన్-థియేట్రికల్ డీల్స్ విషయంలో విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. జనవరి 9నే 'జననాయగన్' థియేటర్లలోకి రావాల్సిఉంది. అయితే, సెన్సార్ పరమైన కొన్ని ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే ఈ సినిమా నాన్-థియేట్రికల్ ఒప్పందాలు రద్దయినట్లు తెలుస్తోంది. దీనితోపాటు ఇప్పటివరకు జరిగిన అన్ని థియేట్రికల్ అగ్రిమెంట్లను కూడా రద్దు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు అడ్వాన్స్ డబ్బులను తిరిగి ఇచ్చేయాలని విజయ్ నిర్మాతలకు సూచించినట్లు సమాచారం.




# జూలైలో విడుదల కానున్న ది ఇండియా స్టోరీ

భారతదేశంలో జరిగిన కొన్ని నమ్మలేని సంచలన నిజాల ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ అండ్ హార్డ్ హిట్టింగ్ మూవీ 'ది ఇండియా స్టోరీ'. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలో నటిస్తున్నాడు. సాగర్ బీ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రియులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక టీజర్ చూస్తుంటే.. సమాజంలో దాగి ఉన్న అత్యంత దిగ్భ్రాం÷-రతికరమైన నిజాలను, తెరవెనుక జరిగిన పరిణామాలను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నామని చిత్ర యూనిట్ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక విలక్షణమైన కథాంశంతో, ప్రేక్షకులను ఆలోచింపజేసే సస్పెన్స్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.








# సుదీర్ఘ కాలం తరవాత వైష్ణవ్ తేజ్ మూవీకి ఓకే

'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బ్జడెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656